కాంగ్రెస్ పాలనలోనే మైనార్టీల సంక్షేమం


ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డితో ఫసియుద్దీన్

శంషాబాద్: కాంగ్రెస్ పాలనలోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఎంఐఎం నుంచి కాంగ్రెస్‌లో చేరిన మహ్మద్ ఫసియుద్దీన్ సోమవారం రంజిత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో మైనార్టీలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గుచూపుతున్నారన్నారు.

రూమా క్రికెట్ విజేత ఎన్‌ఎస్‌వైసీ డెయిరీఫామ్ జట్టు


క్రికెట్ పోటీల్లో విజయం సాధించిన ఎన్‌ఎస్‌వైసీ డెయిరీఫామ్ జట్టు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎన్‌ఎస్‌వైసీ డెయిరీఫామ్ జట్టు 27వ రూమా కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజయం సాధించింది. సోమవారం ఎంకేపల్లిలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో డెయిరీఫామ్ జట్టు ఐసీసీ 11 జట్టుపై ఒక వికెట్ తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఐసీసీ 11 జట్టు 20 ఓవర్లలో 151 పరుగులకు ఆలౌట్ అయింది. డెయిరీఫామ్ జట్టు కెప్టెన్ రాఘవేంద్ర చారి ఐదు వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాజేంద్రనగర్‌డెయిరీఫామ్ జట్టు 19.3 ఓవర్లలో 154 పరుగులు చేసి విజయం సాధించింది. 24 పరుగులు తీసిన జట్టు కెప్టెన్ రాఘవేంద్ర చారి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు.

పరామర్శ


కొలన్ రంగారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రాజేంద్రనగర్: హైదర్‌గూడకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొలన్ సుభాష్ రెడ్డి సోదరుడు కొలన్ రంగారెడ్డిని సోమవారం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. కొలన్ రంగారెడ్డి భార్య ఈశ్వరమ్మ (83) ఆదివారం కన్నుమూశారు. ఈ నేపథ్యంలో సోమవారం కొలన్ రంగారెడ్డి ఇంటికి వచ్చిన సబితా ఇంద్రారెడ్డి వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆమె వెంట నాయకులు మామిడి సుధాకర్ రెడ్డి, బందారి రమేశ్, కొలన్ ప్రతాప్ రెడ్డి, సుభాష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, జైపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

తైక్వాండోతో ఆత్మ విశ్వాసం


బెల్ట్‌లు అందుకున్న క్రీడాకారులు

మణికొండ: తైక్వాండో క్రీడతో చిన్నారుల్లో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని గ్రాండ్ మాస్టర్ మొయినుద్దీన్ అన్నారు. సోమవారం మణికొండ మర్రిచెట్టు సర్కిల్‌లోని విక్టరీ తైక్వాండో అకాడమీలో బెల్ట్‌ల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తైక్వాండోలో రాణిస్తే అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు వస్తాయన్నారు. తల్లి తండ్రులు తమ పిల్లలను వారికి నచ్చిన క్రీడలో రాణించేందుకు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో కోచ్ వెంకటేశ్‌తో పాటు తల్లితండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఎల్లో, గ్రీన్, బ్లూ, రెడ్ బెల్ట్‌లను ప్రదానం చేశారు.

పరీక్షా ఫలితాలపై ఆందోళన వద్దు

గోల్కొండ: తాము రాసిన పరీక్షలపై విద్యార్థులు ఆందోళన చెందవద్దని ప్రముఖ సైకాలజిస్ట్, తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఏ.కరీం అన్నారు. ఏప్రిల్ చివరి వారంలో వివిధ పబ్లిక్ పరీక్షల ఫలితాలు వెల్లడికానున్న నేపథ్యంలో ఆయన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పరీక్షలు ఎంతో ధైర్యంగా రాసిన విద్యార్థులకు పరీక్ష ఫలితాల తేదీలు తెలిసినప్పటి నుంచి ఆందోళన చెందుతారని ఆయన అన్నారు. పిల్లల్లో మానసిక ఒత్తిడి పెంచకుండా ధైర్యాన్ని నింపాలని కోరారు. పరీక్షల్లో తప్పిన, మార్కులు తక్కువ వచ్చినా మళ్లీ పరీక్ష రాయవచ్చు అన్న విషయం పిల్లల్లో నూరిపోయాలన్నారు.

‘ఐఎస్‌బీ’లో టీచర్ ఆఫ్ ది ఇయర్ ఎంపిక

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో టీచర్ ఆఫ్ ది ఇయర్‌గా పలువురు ప్రొఫెసర్లు ఎంపికయ్యారు. అందులో భాగంగా పబ్లిక్ పాలసీ విభాగంలో అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్(ఏఎంపీపీపీ) క్లాస్ ఆఫ్ 2023, అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఫర్ హెల్త్‌కేర్ (ఏఎంపీహెచ్) క్లాస్ 2023లో టీచర్ ఆఫ్ ది ఇయర్‌గా పలువురు ప్రొఫెసర్లను ఎంపిక చేసి వారిని సన్మానించారు. ఏఎంపీహెచ్‌క్లాస్–2023లో టీచర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైన వారిలో ప్రొఫెసర్ అంజల్ ప్రకాశ్, ప్రొఫెసర్ నందు నందకిషోర్, ప్రొఫెసర్ సారంగ్‌డియో, పీజీపీ ఎంఎఫ్‌ఏబీ క్లాస్–2023లో ప్రొఫెసర్ సిద్ధార్థ్ ఎస్ సింగ్ ఏఎంపీపీపీ క్లాస్–2023లో ప్రొఫెసర్ అంజల్ ప్రకాశ్, ఏఎంపీహెచ్ క్లాస్–2023లో ప్రొఫెసర్ నందు నందకిషోర్, పీజీపీ ఎంఎఫ్ఏబీ క్లాస్–2023లో ప్రొఫెసర్ షమికా రవి, పీజీపీ క్లాస్–2024 కోర్ కార్సెస్‌లో ప్రొఫెసర్ సుమిత్‌కున్ను మ్కల్, ప్రొఫెసర్ మిలింద్ సోహోని, ప్రొఫెసర్ ఎం విజయసుందర్ ఎంపికయ్యారు. వీరిని ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల, పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

నీళ్లిస్తేనే ఓట్లు..

బండ్లగూడ జాగీరు పద్మశ్రీహిల్స్ కాలనీవాసుల వినూత్న నిరసన
- తాగునీటి ఎద్దడిపై ఆగ్రహం
- నివాసాలు, అపార్టుమెంట్ల ఎదుట బోర్డుల ఏర్పాటు





పద్మశ్రీహిల్స్ కాలనీలో ఇంటి ఎదుట ఏర్పాటు చేసిన బోర్డు


అపార్ట్‌మెంట్ ఎదుట ఏర్పాటు చేసిన బోర్డు

బండ్లగూడ: ‘సమస్యలు పరిష్కరించండి.. తర్వాతే ఓట్లు అడగండి’ అని నగర శివార్లలోని పలు కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. పన్నులు చెల్లిస్తున్నా తమ సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వినూత్న రీతిలో ఇళ్ల ముందు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి వచ్చే నాయకులకు నోట మాట రావడం లేదు. తాగునీటి కష్టాలు తీర్చిన తర్వాతే ఓట్లు అడగాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పద్మశ్రీహిల్స్ కాలనీ వాసులు స్పష్టం చేస్తున్నారు.

వినూత్న నిరసన..

పద్మశ్రీహిల్స్‌కాలనీలో నెలకొన్న నీటి ఎద్దడిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ‘పన్నులు కడుతున్నాం, తమ కాలనీకి నీళ్లు ఇచ్చే వరకు ఓటు అడిగేందుకు రావద్దు’ అంటూ రాసిన ఫెక్సీలు, బోర్డులను అపార్ట్‌మెంట్ గేట్లు, ఇళ్ల ప్రధాన ద్వారాలకు వేలాడదీశారు.

నీటి సరఫరాలో అధికారులు విఫలం..

కాలనీలో నెలకొన్న నీటి సమస్యపై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. గత మార్చిలో కాలనీకి చెందిన పలువురు మహిళలు ర్యాలీగా ప్రధాన రహదారిపైకి ఫ్లెక్సీలు, ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. అప్పుడు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిషన్ భగీరథ పథకం కింద కార్పొరేషన్‌కు రూ.50 కోట్లు మంజూరు

అవుటర్ రింగ్ రోడ్ లోపలి ప్రాంతాలకు జలమండలి ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా జరుగుతోంది. బండ్లగూడ జాగీరు కార్పొరేషన్ పరిధిలో 200కి పైగా కాలనీలు ఉండగా కొన్ని కాలనీలకు మాత్రం ఇప్పటి వరకు తాగునీరు సరఫరా కావడం లేదు. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం కింద కార్పొరేషన్ పరిధిలో రూ. 50 కోట్లతో ట్యాంకుల నిర్మాణం చేపట్టినా ప్రజల అవసరాలకు తగినట్లుగా నీటి సరఫరాను పెంచకపోవడంతో ఆయా కాలనీలవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నీటి సమస్య తీర్చండి..



మా కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాకే ఓటు అడగండి. పద్మశ్రీ హిల్స్ కాలనీలో వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టినా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో తాగునీటి సమస్య నానాటికి తీవ్రమవుతోంది. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం . ట్యాంకు పనులు త్వరితగతిన పూర్తిచేసి నీటిని సరఫరా చేస్తే పద్మశ్రీహిల్స్ కాలనీతో పాటు మానసాహిల్స్, తిరుమల గార్డెన్, గోల్డెన్ వ్యాలీ తదితర కాలనీల్లో సమస్య పరిష్కారమవుతుంది.

-పవన్ ధూళిపాళ్ల,
పద్మశ్రీహిల్స్ కాలనీ వాసి

మేడే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రాజేంద్రనగర్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా మే 1న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య అన్నారు. సోమవారం ఆయన బుద్వేల్‌లోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు, మాజీ జిల్లా అధ్యక్షుడు పుస్తకాల నర్సింగ్ రావులతో కలిసి మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయన్నారు. 15 ఏళ్లుగా కనీస వేతన చట్టాన్ని సవరించ లేదన్నారు. మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చి శ్రమ దోపిడీ చేస్తుందని ఆరోపించారు. మేడే సందర్భంగా కార్మికుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి నరసింహా రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్.మల్లేష్, కార్మిక నాయకులు రియాజ్, స్వామి, శేఖర్ రెడ్డి, సత్తయ్య, గువ్వల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రారెడ్డి ఆశయసాధనకు కృషి


ఇంద్రారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అర్చన ,కార్తీక్ రెడ్డి


ఇంద్రారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: మాజీ హోంమంత్రి ఇంద్రారెడ్డి ఆశయసాధనకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్‌ఎస్ యువనేత, ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి అన్నారు. సోమవారం ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా రాజేంద్రనగర్ పీడీపీ చౌరస్తాలో ఇంద్రారెడ్డి అభిమాని సామ ఇంద్రపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్, కార్తీక్ రెడ్డి హాజరై ఇంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంద్రారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కోరని శ్యామ్, జాలిగం చిత్తారి, పచ్చ శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, డి.రమేశ్ ముదిరాజ్, జీవన్ దాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రారెడ్డి సేవలు ఎనలేనవి

శంషాబాద్ రూరల్: మాజీ మంత్రి పి.ఇంద్రారెడ్డి సేవలు ఎనలేనివని పలువురు నేతలు అన్నారు. సోమవారం ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని పాల్మాకుల వద్ద ఉన్న ఆయన విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కె.శ్రవణ్‌కుమార్, నాయకులు చక్రధర్‌రెడ్డి, కృష్ణగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, రావినాయక్, ఉమ్లానాయక్, జహంగీర్, నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కార్పొరేటర్లు లతాప్రేమ్‌గౌడ్, తలారి చంద్రశేఖర్, సంతోషి రాజిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, నిఖిల సంగారెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, ఆసియాఖాజా, అనిత వెంకటేష్‌లతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు మెరుగైన పాలన అందుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి విజయానికి సమష్టిగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మద్దం రాము, పుష్పమ్మ, శ్రవంతి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూమి కబ్జా చేస్తున్నారు..

పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

శంషాబాద్ రూరల్: తన పట్టా భూమిని కొందరు రియల్టర్లు కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తూ ఓ మహిళ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దతూప్ర గ్రామం సర్వే నంబర్ 106లో కాసిరెడ్డిగూడెం సుజాత అనే మహిళకు ఆమె తండ్రి కట్నంగా మూడు ఎకరాల పొలం ఇచ్చాడు. దాయాదుల పొలాల మధ్యలో సదరు భూమి ఉంది. అయితే వారి దాయాదుల నుంచి భూమిని కొనుగోలు చేసిన రియల్టర్లు సుజాత భూమిని కూడా చదును చేసి కబ్జాకు యత్నిస్తున్నారు. ఈ విషయమై బాధితురాలు శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పనులను అడ్డుకుని తనకు న్యాయం చేయాలని ఆమె కోరింది.

స్కూల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: స్కూల్‌బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మల్కారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దార కృష్ణయ్య(55) సోమవారం రోడ్డు దాటుతుండగా శంషాబాద్‌నుంచి షాబాద్‌వైపు వెళ్తున్న బ్రిలియంట్ స్కూల్ బస్సు అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కృష్ణయ్యను ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి


మాట్లాడుతున్న శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ ఆఫీసర్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. ‘పార్లమెంట్ ఎలక్షన్–2024 స్వీప్’ కార్యక్రమంలో భాగంగా సోమవారం ‘ఐ ఓట్ ఫర్ ష్యూర్’ అనే థీమ్‌తో కాళీమందిర్ సమీపంలోని జేఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరూ తమ కాలనీల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతాన్ని పెంచాలని, నూతన ఓటర్లను చైతన్యవంతం చేయాలన్నారు. ప్రలోభాలకు గురి కాకుండా మంచి నాయకులను ఎన్నుకుని మంచి సమాజాన్ని నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, టిఎల్‌ఎఫ్ అధ్యక్షులు మధుమతి, టీఎంసీ శ్రీలత, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీలో టెక్స్ అకాడమీ పరీక్ష


శిక్షణకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో టెక్స్ అకాడమీ సంస్థ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సులను అందించేందుకు అర్హత పరీక్ష నిర్వహించింది. సోమవారం కళాశాలలో జరిగిన ఈ పరీక్షలో 6వ సెమిస్టర్ చదువుతున్న ఎన్. అఖిల్‌కుమార్, జి.సత్యసాయి అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీవీ నర్సింహులు మాట్లాడుతూ ఇలాంటి కోర్సులు విద్యార్థులకు మంచి ప్లేస్‌మెంట్‌లు సాధించేందుకు దోహదపడతాయన్నారు. శిక్షణ అనంతరం వీరికి ఉద్యోగాలను కల్పిస్తామని టెక్స్ అకాడమీ గ్రూప్ కమ్యూనికేషన్ మేనేజర్ మోహన్‌దాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఇంజినీరింగ్ టెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం. సుబ్రహ్మణ్యం, కళాశాల పీఆర్‌ఓ జీఎస్‌ఆర్ ప్రసాద్, అధ్యాపకురాలు కవిత అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గోల్కొండ: సంపూర్ణ ఆరోగ్యంతోనే అనుకున్నది సాధించవచ్చునని షేక్‌పేట్ నాగార్జున స్కూల్ కరస్పాండెంట్ భరత్‌కుమార్‌గౌడ్ అన్నారు. పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థికి వైద్యులు కేన్సర్‌గా నిర్ధారించారు. ఆ విద్యార్థి కుటుంబం వైద్యం చేయించే ఆర్థిక స్తోమత లేకపోవడంతో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నిధిని సేకరించారు. సోమవారం పాఠశాలలో ఆ డబ్బులను కరస్పాండెంట్ భరత్‌కుమార్‌గౌడ్ విద్యార్థికి అందించారు. ఆయన మాట్లాడుతూ..అతడికి కేన్సర్ నిర్ధారణ కాగానే తాము ఎంతో ఆందోళనకు గురయ్యామన్నారు. కేన్సర్‌పై విజయం సాధించేందుకు తమవంతు సహాయంగా అతడి కుటుంబానికి అండగా ఉంటున్నామని ఆయన పేర్కొన్నారు.

నిస్వార్థంగా సేవ చేసేందుకే రాజకీయాల్లోకి..


నామినేషన్ దాఖలు చేస్తున్న ఎంఏ కవి అబ్బాసీ

రాజేంద్రనగర్: ప్రజలకు నిస్వార్థ సేవలు అందించేందుకే తాను ఎన్నికల బరిలో నిలిచానని ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది ఎంఏ కవి అబ్బాసీ అన్నారు. సోమవారం ఆయన చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మైనార్టీ, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా తమ పార్టీ పని చేస్తుందన్నారు. తనను గెలిపిస్తే ప్రధాన రాజకీయ పార్టీలకు సాధ్యం కాని అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది.



బండ్లగూడ: అగ్ని ప్రమాదాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనూప్‌శర్మ అన్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో అగ్నిమాపక సిబ్బంది అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాసాని విజయానికి కృషి చేయాలి


బీఆర్‌ఎస్ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయమని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, పార్టీ అధ్యక్షులు అంతారం నరేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నాయకులు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించాలని సూచించారు. బీఆర్‌ఎస్ పాలనా కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ 30 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నారని, మంచి అనుభవం ఉన్న బీసీ నాయకుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన నేత అని కొనియాడారు. ఆయనను ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో బీసీల గొంతును వినిపిస్తారన్నారు. పార్టీలకు అతీతంగా బీసీలు సంఘటితమై మన ఓటు మన నాయకుడికే వేసుకుని కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, సీనియర్ నాయకులు నవాబ్ ముంతాజ్, పాండు, మలాకీ రత్నం, జగదీష్, రజాక్, విష్ణురెడ్డి, సుమన్‌గౌడ్, సుందర్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాసాని నామినేషన్...

చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మంగళవారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ తెలిపారు. నామినేషన్ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండ్లగూడ ఆరె మైసమ్మ ఆలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సమష్టి కృషితోనే విజయం


సమావేశంలో పాల్గొన్న పార్టీ సమన్వయకర్త తలారి మల్లేష్

మణికొండ: చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పార్టీ గండిపేట మండల సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ అన్నారు. సోమవారం మణికొండలోని పార్టీ కార్యాలయంలో మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు అధ్యక్షతన ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. మంగళవారం కాసాని నామినేషన్ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లు బి.కావ్య శ్రీరాములు, ఎ.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.